క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్ రోడ్డులోని రజక సంఘం, మైత్రినగర్ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్వేతార్కుడిని దర్శించుకున్న మాధవానంద సరస్వతి



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రాన్ని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో జరుగుతున్న వసంతోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయానికి చేరుకున్న స్వామిజీకి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న 29 దేవతామూర్తులను స్వామిజీ దర్శించుకుని పూజలు చేశారు. పండితులు లక్ష దమన పూజ, 108 కలశాల పూజ, మహా భస్మాభిషేకం, సహస్ర నామార్చనలు చేశారు. సంపూటి హోమాలు జరిపించారు.

అలవేణికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం పరిశోధకురాలు ఎం.అలవేణికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎఫెక్ట్ ఆఫ్ సర్టెయిన్ పెస్టిసైడ్స్ ఆన్ ది మెటబాలిజం ఆఫ్ ఎ ఫ్రెష్ వాటర్ ఫిష్ చన్న పున్‌క్టాటస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి అలవేణికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో అలవేణి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

ఆటో ఢీకొని వృద్ధుడి దుర్మరణం

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోకుల్‌నగర్ సమీపంలో సోమవారం ఉదయం ఆటో ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. బంజారా కాలనీకి చెందిన గుగులోతు చంద్రు (65) రోడ్డు దాటుతుండగా అంబేడ్కర్ విగ్రహం నుంచి వడ్డెపల్లి వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కాగా, ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడు గుగులోతు సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం -1 వద్ద విజయవాడ వైపు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మెట్ల కింద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 45 ఏళ్ల వయస్సు వ్యక్తి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాల కోసం 99594 25483, 87126 85858 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

హసన్‌పర్తి: చికిత్స పొందుతున్న ఓ యువకుడు ఎంజీఎం ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మల్లారెడ్డిపల్లికి చెందిన పున్నం దినేష్‌కుమార్(24) స్థానికంగా హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 6న తెల్లవారు జామున ప్రమాదవశాత్తు స్లాబ్‌పై నుంచి కింద పడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆ యువకుడు మృతి చెందినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ

ఖిలా వరంగల్: ఇద్దరు యువకులు మంచి స్నేహితులు. ఓ యువతి కారణంగా ఆ ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. వారు ఒకరికి తెలియకుండా మరొకరు ఓకే యువతిని ప్రేమించారు. ఈ విషయం తెలిసి ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. సోమవారం ఉదయాన్నే రైల్వేగేట్ ప్రాంతంలోని ఓ కాలనీకి చెందిన యువతి విషయంపై ఇరువురు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడి విషయం యువతి ఇంట్లో తెలియటంతో ఆగ్రహానికి లోనైన ఆ యువతి సోదరుడు ఓ యువకుడిని కారుతో ఢీ కొట్టగా అతడికి గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. గాయపడిన యువకుడు మిల్స్‌కాలనీ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాధ్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం.

బారులుదీరి.. బాధ్యతగా ఓటేసి



మేయర్ గుండు సుధారాణి



శంభునిపేట పాఠశాలలో బారులుదీరిన ఓటర్లు



కాశిబుగ్గ: ప్రతాప్‌నగర్ పోలింగ్ బూత్ వద్ద గుమిగూడిన నాయకులు



మడికొండలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళా ఓటర్లు



ఎర్రబెల్లి ప్రదీప్‌రావు దంపతులు



ఉడుముల బాల



జంగా రాఘవరెడ్డి దంపతులు

కాజీపేట అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఇష్టమైన ఎంపీ అభ్యర్థిని ఎన్నుకునేందుకు నగర ప్రజలు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాజీపేట మండలంలోని న్యూశాయంపేట, కడిపికొండ, భట్టుపల్లి, తరాలపల్లి, కొత్తపల్లి, కుమ్మరిగూడెం, రాంపేట ప్రాంతాల్లోని ప్రజలు ఉదయం నుంచే బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. న్యూశాయంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రమశక్తి అవార్డు గ్రహీత కుసుమ శ్యాంసుందర్ దంపతులు ఓటు వేశారు.

కాజీపేటలో పోలింగ్ ప్రశాంతం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని పలు డివిజన్లలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలైన దర్గా కాజీపేట, సోమిడి, బాపూజీనగర్, బాబుక్యాంపుల్లో కాజీపేట ఏసీపీ తిరుమల్ రావు పర్యవేక్షణలో సాయుధ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను సీఐ సుధాకర్ రెడ్డి పర్యవేక్షించారు. రహమత్‌నగర్‌లో పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే గంటసేపు ఈవీఎంలు మొరాయించాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు కడియం కావ్య, డాక్టర్ సుధీర్ కుమార్, అరూరి రమేష్‌తో పాటు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, రావు పద్మ ఓటింగ్ సరళిని పరిశీలించారు. కాజీపేటలో క్రైస్తవ పీఠాధిపతి బిషప్ ఉడుమల బాల, ప్రశాంత్‌నగర్ కాలనీలో బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు ఓటు వేశారు.

కాశిబుగ్గలో..

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 18, 19, 20, 35వ డివిజన్లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కాశిబుగ్గ స్టాండర్డ్ హైస్కూల్ బూత్ వద్ద కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య పార్టీ కండువాల విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. ప్రతాప్‌నగర్ బూత్ సమీపంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎదురెదురుగా శిబిరాలు ఏర్పాటు చేసుకుని ప్రచారం నిర్వహించారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటరు స్లిప్పులను ముందే అందించాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేసినా అంగన్‌వాడీలు, ఆర్పీలు అదేమి పట్టించుకోకుండా చాలాచోట్ల ఓటరు స్లిప్పులను పంచలేదు. దాంతో తమ ఓటు ఎక్కడ ఉందో అని ఓటర్లు ఆందోళన చెందారు.



ఓటేసిన కుసుమ శ్యాంసుందర్ దంపతులు



కర్నాటి వరుణ్ రెడ్డి



దాస్యం వినయ్‌భాస్కర్, రేవతి దంపతులు



తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు



మంద కృష్ణమాదిగ



ఏనుగుల రాకేష్ రెడ్డి



రావు పద్మ



బైరి సోమయ్య దంపతులు

ప్రతాప్‌నగర్ బూత్‌లో ఓటు వేసిన ఎర్రబెల్లి ప్రదీప్‌రావు దంపతులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తన సతీమణి రేణుకతో కలిసి ప్రతాప్‌నగర్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఖిలా వరంగల్ పరిధిలో..

ఖిలా వరంగల్: మండలం పరిధిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఖిలా వరంగల్ త్రికోట, శాంతినగర్, శివనగర్, శంభునిపేట, ఎస్ఆర్ఆర్‌తోట, విద్యానగర్, ఏకశిలా నగర్, ఉర్సు కరీమాబాద్, రంగశాయిపేట, మామునూరు, బొల్లికుంట, తిమ్మాపురం, అల్లీపురం, దూపకుంట, వసంతాపురం, స్తంభంపెల్లి, ఆదర్శనగర్ గ్రామాల్లోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మేయర్

వరంగల్ అర్బన్: వరంగల్ రామన్నపేట పడిశాల వీరభద్రయ్య కళాశాలలో నగర మేయర్ గుండు సుధారాణి, ప్రభాకర్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో నగర మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన, నవీన్ దంపతులు, శాప్ మాజీ డైరెక్టర్ రాజనాల శ్రీహరి, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఓటు వేశారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన అరూరి రమేష్

హన్మకొండ: వరంగల్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ సోమవారం పరిశీలించారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ బూత్‌లను సోమవారం సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

మడికొండలో..

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46, 64వ డివిజన్లలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ కనిపించలేదు. ఓటర్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. కాగా, ఎన్నికల సరళిని సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఎ.బారి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య ఓటింగ్ సరళిని పరిశీలించారు.

వర్ధన్నపేటలో 66.43 శాతం పోలింగ్ నమోదు



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



తొలిసారి ఓటు వేసిన కల్యాణ్‌రామ్

హసన్‌పర్తి: వరంగల్ పార్లమెంట్ పరిధిలోని వర్ధన్నపేట నియోజకవర్గంలో 66.43శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 6గంటలకు ముగిసింది. ఉదయం సాంకేతిక కారణాల వల్ల కొంతసేపు ఈవీఎంల్లో సమస్య తలెత్తింది. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఓటింగ్ కొంత మందకొడిగా సాగింది. మధ్యాహ్నం 3గంటల వరకు బారులుదీరి కనిపించారు.

రాత్రి వర్షంతో..

ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది. దీంతో ఓటర్లు ఓటు వేయడానికి ముందుకు వచ్చారు. వాతావరణం అనుకూలించడంతో ఓటింగ్ శాతం పెరిగింది.

పోలింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు

పోలింగ్ కేంద్రాలను ఆయా పార్టీల అభ్యర్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఓటింగ్ సరళిని పరిశీలించారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ సందర్శించారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే నాగరాజు సందర్శించారు.

వరంగల్ 'తూర్పు'లో ఎన్నికలు ప్రశాంతం

వరంగల్ అర్బన్: వరంగల్ లోకసభ ఎన్నికల్లో భాగంగా తూర్పు శాసన సభ నియోజకవర్గంలో పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,58,495 మంది ఓటర్లు ఉండగా 230 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. తూర్పులో 24 డివిజన్లలో 230 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఉదయం 7గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు భారీగా చేరుకున్నారు. ఎన్నికలకు ముందు రోజు రాత్రి భారీ వర్షం కురవడంతో సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల మండుతున్న ఎండలతో మధాహ్నం ఎండ తీవ్రతను గుర్తించిన ఓటర్లు ముందస్తుగా ఉదయం వేళల్లోనే ఓటను వేసేందుకు ఆసక్తి కనబరిచారు. దాంతో పోలింగ్ కేంద్రాల్లో బారులుదీరారు.



తూర్పుకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న నాయకులు



సోమిడి ప్రభుత్వ హైస్కూల్‌లో బారులుదీరిన ఓటర్లు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ బారి



ఓటు హక్కును వినియోగించుకున్న నాయకులు

దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్టి పూజలు



సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కాశిబుగ్గ: సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప, సుబ్రహ్మణ్య, ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి ఆలయానికి తరలివచ్చి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు, దాతల ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూచన ఏకాంబ్రం, దాతలు సోమ సుందర్, రాజేందర్, అర్చకులు శ్రీకాంతచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజేయుడి బ్రహ్మోత్సవాలు

- ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరగనున్న వేడుకలు

హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 24 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన బ్రోచర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు గంద కృష్ణ మాట్లాడుతూ 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు వార్షిక బహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజు స్వామి వారికి విశేష పూజలు, అర్చనలు, హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కనుకుంట్ల రవికుమార్, దశరథకుమార్, గంధ్రాతి సుధాకర్, ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీతారామచంద్ర ఆలయంలో పూజలు




ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మడికొండ: శ్రీరామనవమి, పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, అనంతరం యాగశాలలో మూలమంత్ర హోమం, రుద్రహోమం చేశారు. శ్రీరాముడిని పెండ్లి కుమారుడిగా తయారు చేసి, సాయంత్రం లక్ష్మీ సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, రాగిచేడు అభిలాష్‌శర్మ, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, భక్తులు అద్దెంకి సురేష్, వెంకన్న, నర్సింహ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


తప్పుల తడకగా ఓటరు జాబితా

57వ డివిజన్‌లో కేఎంసీ, జైల్ క్వార్టర్ ఓటర్లు

హన్మకొండ: అధికారులు అలసత్వం, నిర్లక్ష్యానికి ఓటరు జాబితా అద్దం పడుతోంది. గ్రేటర్ వరంగల్ పరిధి వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 57వ డివిజన్‌లోని 229 పోలింగ్ బూత్‌లో కాకతీయ మెడికల్ కాలేజీ, జైల్ క్వార్టర్‌లో నివాసముంటున్న ఓటర్లు నమోదై ఉన్నాయి. కాకతీయ మెడికల్ కాలేజీ పేరుపై ఓటర్లు ఉంటున్నట్లు చూపించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దీంతో పాటు జైల్ క్వార్టర్లు లేకున్న అందులో ఓటర్లు ఉన్నట్లు చూపించారు. వరంగల్‌లో ఉన్న కాకతీయ మెడికల్ కాలేజీ, జైల్ క్వార్టర్‌లలో నమోదైన ఓటర్ల వివరాలు హనుమకొండ సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 229 పోలింగ్ బూత్‌లో చేర్చడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయా పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇదే పోలింగ్ బూత్‌కు చెందిన ఓటర్ల జాబితాలో క్రమసంఖ్య ఒకటి నుంచి 28 వరకు ఇంటినంబర్ లేకుండా ఓటర్ల వివరాలు నమోదు చేశారు. అదే విధంగా క్రమసంఖ్య 1201, 1202, 1203, 1204 ఓటర్లు ఇంటినంబర్ స్థానంలో కాకతీయ మెడికల్ కాలేజీ అని పొందుపరిచారు. ఇంటినంబర్ వెంకట్ ఎంపీఎల్‌తో క్రమ సంఖ్య 1235 నుంచి 1249 వరకు ఓటర్ల పేర్లు నమోదు చేశారు. ఈ పోలింగ్ బూత్‌లో రైల్వే క్వార్టర్స్ లేకున్న ఇంటినంబర్ రైల్వే క్వార్టర్ పేరుతో సీరియల్ నంబర్ 1224 నుంచి 1226 వరకు ఓటర్ల పేర్లు నమోదు చేశారు. జాబితా తప్పులతడకగా మార్చిన అధికారులు, ఉద్యోగులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని రాజకీయ నాయకులు, ఓటర్లు డిమాండ్ చేశారు.



పశ్చిమ నియోజకవర్గంలో 229 పోలింగ్ బూత్‌లో ఇంటినంబర్ రైల్వే క్వార్టర్ పేరుతో ఓటర్ల పేర్లు



229 పోలింగ్ బూత్‌లో ఇంటినంబర్ వెంకట్ ఎంపీఎల్ పేరుతో ఓటర్ల వివరాలు



పంచింది తక్కువ.. నొక్కింది ఎక్కువ!

కాజీపేట: లోక్‌సభ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నిర్వహణ ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బుల్లో కార్యకర్తలు కొంచెం పంచి.. ఎక్కువగా నాయకులే నొక్కేశారనే విషయం కాజీపేట పట్టణంలో చర్చనీయంశంగా మారింది. రాజకీయ పార్టీల మధ్య తీవ్ర స్థాయిలో పోటీ నెలకొనడంతో ఒక్కరిపై ఒకరు నిఘాను అధికం చేశారు. ఆయా పార్టీల అభ్యర్థుల పక్షాన డబ్బులు తీసుకున్న నాయకులు పది, ఇరువై ఇళ్లలో పంచినట్టుగా చేసి అధికారులను సాకుగా చూపి డబ్బులు జేబుల్లో పెట్టుకుని ఇళ్లకు జారుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఒక పార్టీ ఓటుకు రూ.200లు, మరొక పార్టీ రూ.300లు, మరో పార్టీ రూ.100 చొప్పున పంపిణీ చేయాలని నిశ్చయించి.. ఆయా పార్టీల నాయకులు కింది స్థాయికి డబ్బులను పంపించారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి, కష్టించి పని చేసే కార్యకర్తలు ఎందరో ఉండగా.. వారందరినీ పక్కన బెట్టి నిన్న, మొన్న పార్టీలో చేరిన నాయకులకు డబ్బుల పంపిణీ బాధ్యతలు అప్పగించడం కొంతమంది కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేక పోయి వెన్నుపోటు రాజకీయాలు నడిపిన నాయకులకు మరో పార్టీ డబ్బుల పంపిణీ బాధ్యతను ఇవ్వడమే కొంపముంచిందని పోటీలో ఉన్న అభ్యర్థులకు పలువురు అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్నట్లు చెబుతున్నారు. కాజీపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఓటర్లు బయటకొచ్చి తమకు ఎందుకు డబ్బులు ఇవ్వలేదని నాయకులను నిలదీసిన ఘటనలు జరిగాయి.

జంక్షన్ జలమయం



కాజీపేట జంక్షన్ ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో జలమయంగా మారింది. రైల్వేస్టేషన్ ఎదుట సర్క్యులేటింగ్ ఏరియా ప్రాంతం నుంచి కాజీపేట జంక్షన్ మీదుగా.. టికెట్ బుకింగ్ కౌంటర్లు, ప్లాట్‌ఫాంపైకి వరద నీరు చేరుకోవడంతో రైల్వే ప్రయాణ ప్రాంగణం చెరువులా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

- కాజీపేట రూరల్